క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో మహా పడిపూజ



బాలానగర్: మండల కేంద్రంలోని శివాలయం లో మహాపడిపూజ వైభవంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శివాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. శివభక్తులు ఆలపించిన భక్తి పాటలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దశరథ్, రాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు రూ.లక్ష ఆర్థికసాయం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు పుల్లూరు వెంకటేశ్వరమ్మ, రవీందర్‌రెడ్డి దంపతులు అనాథ పిల్లల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రవి నాయక్, జెడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా రెడ్‌క్రాస్ సంస్థకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు నటరాజ్, సభ్యులు డా.శ్యాముల్, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ దంపతులను ఘనంగా సన్మానించారు.

సీఐగా ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్ క్రైం: మహిళ పోలీస్ స్టేషన్ సీఐగా ఇజాజుద్దీన్ జిల్లాకేంద్రంలో మంగళవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల ఇక్కడ సీఐగా ఉన్న చంద్రశేఖర్ మక్తల్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి బదిలీపై ఇజాజుద్దీన్ వచ్చారు.

ఉద్యోగులను నిండా ముంచారు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగులను ఆర్థికశాఖ మాజీమంత్రి నిండాముంచారని..ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీశారని ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆయన హయాంలో ఒకనెల కూడా జీతాలు సరిగ్గా ఇవ్వలేదని, వేలాది ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు, జీపీఎఫ్ సరేండర్ లీవ్, టీఎస్ జీఎల్ఐ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు రెండేళ్లుగా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

కరపత్రం విడుదల

జడ్చర్ల టౌన్: దేశవ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో కరపత్రాలు విడుదల చేశారు. జగన్, సత్తయ్య పాల్గొన్నారు.
జడ్చర్ల: సార్వత్రిక కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం పోలేపల్లి సెజ్‌లో ప్రచారజాతలో పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు దీప్లా నాయక్, సత్తయ్య, కృష్ణ, పాల్గొన్నారు.

నల్లగొండకు తరలిన నాయకులు

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం అధినేత కేసీఆర్ పిలుపు మేరకు నల్లగొండకు తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, అశోక్ గౌడ్, ఎం. సత్యనారాయణ, రామునాయక్ తదితరులు తరలివెళ్లారు.
మహబూబ్‌నగర్ న్యూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ప్రతిఘటించక తప్పదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సిములు, రాజేశ్వర్‌గౌడ్, వెంకన్న, బాల్‌రాజ్, ఆంజనేయులు, గణేష్, ప్రవీణ్, రవికిషన్‌రెడ్డి, కృష్ణమోహన్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు నల్లగొండ సభకు వెళ్తున్న సందర్భంగా మాట్లాడారు. పోస్టర్లు విడుదల చేశారు.

జాతీయ పోటీలకు గురుకుల విద్యార్థి

కోయిల్‌కొండ: మండలంలోని బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి కె.శివకుమార్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. శివకుమార్ ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో పథకాలు సాధించినట్లు వివరించారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయబృందం అభినందించారు.

పూర్తికావచ్చిన ఇంటింటి సర్వే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో రూ.500లకే గ్యాస్ సిలిండర్ సర్వే పూర్తికావచ్చింది. ఈనెల 10 నుంచి చేపట్టిన ఈ కార్యక్రమం 14వ తేదీతో ముగియనుంది. మొత్తం 49 వార్డులకు గాను 13,252 మంది ఈ పథకానికి సంబంధించి సరైన వివరాలు ఇవ్వలేకపోయారు. దీంతో ఇంటింటికీ ప్రత్యేక బృందం తిరిగి ఎక్కడికక్కడే సరిచూసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం 920 మంది లబ్ధిదారుల పూర్తి వివరాలను సేకరించారు. ఇంకా కేవలం 380 మంది నుంచి మాత్రమే తీసుకోవాల్సి ఉంది.

గుంతలమయంగా దారులు

- ఓవర్‌లోడ్‌లతో భారీవాహనాల రాకపోకలే కారణమంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు...



ఓవర్‌లోడ్‌తో పట్టుబడిన టిప్పర్లు (ఫైల్)



మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ వద్ద పరిస్థితి(ఫైల్)

బాలానగర్: మండలపరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా మైనింగ్ పరిశ్రమల నేపథ్యంలో భారీ వాహనాలు పరిమితికి మించిలోడ్‌తో ఈ దారులపై తిరుగుతుండడమే దారుల అధ్వానస్థితి కారణమని స్థానిక ప్రజలు వాపోతున్నారు. నిత్యం 100కి పైగా టిప్పర్లు, లారీలు మండల కేంద్రం గుండా కంకర, డస్ట్, మొరంమట్టి, ఇతర వాటిని తీసుకువెళ్తున్నాయని.. వాటిల్లో చాలావరకు పరిమితికి మించి లోడ్‌తో వెళ్తున్నాయని ఆరోపిస్తున్నారు. దీంతో బీటీ, సీసీ రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయని చెబుతున్నారు. విషయంపై ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రాజకీయ ఒత్తిళ్లు, మామూళ్ల మత్తులో ఉండి కొంతమంది అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.
ముఖ్యంగా టిప్పర్లలో పరిమితికి మించి 6 ఇంచ్‌ల నుంచి 1 ఫీట్ వరకు అదనపు ఫిట్టింగ్స్‌తో క్యాబిన్ ఏర్పాటు చేసుకుని ఓవర్‌లోడ్‌తో సామగ్రి తీసుకెళ్తున్నాయని చెబుతున్నారు. మరోవైపు క్రషర్ పరిశ్రమల నుంచి టిప్పర్లు డస్టు, రోబోసాండ్ తదితరాలను తరలిస్తూ రోడ్లపై దుమ్ములేపడం సర్వసాధారణం అయిపోయిందని అంటున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం

సిబ్బంది కొరత కారణంగా జిల్లాలోని 14 మండలాల్లో పర్యావేక్షణ తగ్గిన మాట వాస్తవమే. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించనున్నట్లు సమాచారం. అయినా ఇప్పటికీ ప్రత్యేక నిఘా పెట్టాం. మండల పరిధిలో 4 కేసులు నమోదు చేశాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.
– నరేష్, ఎంవీఐ (ఆర్‌టీఓ), మహబూబ్‌నగర్

చర్యలు తీసుకోవాలి



మండల కేంద్రం గుండా నిత్యం ఎన్నో టిప్పర్లు ఓవర్‌లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రోడ్లన్నీ అధ్వానంగా మారుతున్నాయి. ఇకనైనా సమస్య పరిష్కరించాలి. – చెన్నయ్య, బోడజానంపేట్

పట్టించుకోవడం లేదు



ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలు రహదారులను గుంతలమయం చేస్తున్నాయి. దీనికి తోడు డస్టు, రోబోసాండ్ వంటివి తరలించే వాహనదారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో దుమ్ము లేస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్‌కు విషయం వివరించినా.. ఇప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.
– శివనాయక్, పలుగుమీది తండా

చర్యలు తప్పవు

గత ఆర్థిక సంవత్సరంలో అక్రమ ఇసుకపై రూ. 5 లక్షలకు పైగా జరిమానాలు, అక్రమ ఓవర్‌లోడ్ టిప్పర్లపై రూ.లక్షకు పైగా జరిమానాలు విధించాం. ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతూనే ఉన్నాం. విషయంపై ఉన్నతాధికారులకు వివరిస్తాం. తీరుమారక పోతే చట్టపరమైన చర్యలు తప్పవు.
– విజయ్, ఏడీ మైనింగ్ మహబూబ్‌నగర్

'కృష్ణమ్మ యాత్ర'కు తరలిరండి



విలేకరులతో మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ చేపట్టిన చేపట్టిన బస్సుయాత్ర స్థానికంగా 'కృష్ణమ్మ యాత్ర' పేరుతో ఈనెల 20 నుంచి ప్రారంభం అవుతుందని ఆపార్టీ నాయకుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో 17పార్లమెంట్ స్థానాలను 5 క్లస్టర్లుగా విభజించారని తెలిపారు. మహబూబ్‌నగర్, నల్గొండ, నాగర్‌కర్నూలు స్థానాలను కలిపి ఒక క్లస్టర్‌గా మార్చారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ క్లస్టర్‌లో ఈనెల 20నుంచి మక్తల్ నియోజకవర్గం కృష్ణ నుంచి బస్సుయాత్ర ప్రారంభం కానుందన్నారు. అందుకే కృష్ణమ్మ యాత్రగా పేరు పెట్టుకున్నామని తెలిపారు. ప్రతి సీనియర్ నాయకుడు పాల్గొంటారని.. ప్రజలను చైతన్య పరుస్తామని తెలిపారు. రాబోయే 25ఏళ్ల దేశంలో బీజేపీ పాలన కొనసాగుతుందని జోస్యం చెప్పారు. దేశంలో మోదీకి ముందు.. ఆ తరువాత పాలన అన్నట్లుగా చరిత్రలో చెప్పుకుంటామన్నారు. సమావేశంలో నాయకులు ముచ్చర్ల కృష్ణయ్య, సీతారాంజవహర్, సామల నర్సింహులు, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, సాహితి రెడ్డి, కొంగళి శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

తెలంగాణలో ఎక్కువ స్థానాలు బీజేపీకే

పాలమూరు: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని, ప్రత్యేకంగా ఉమ్మడి పాలమూరులోని రెండు స్థానాలు సొంతం చేసుకుంటుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మంగళవారం ప్రేమ్‌నగర్‌కుచెందిన యువత అధిక సంఖ్యలో పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, లలిత పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు అవసరం



మాట్లాడుతున్న హెచ్‌ఎం విజయ్‌కుమార్



మహమ్మదాబాద్ కేజీబీవీలో..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బీపీహెచ్ఎస్‌లో మంగళవారం ఘనంగా ఇంగ్లిష్ ఫెస్ట్ నిర్వహించారు. హెచ్‌ఎం విజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ ఎంతో కీలకంగా మారిందని, విద్యార్థులు భవిష్యత్తులో ఉద్యోగాలు ఏవైనా పొందాలంటే తప్పసరిగా ఆ భాషలో మాట్లాడే నైపుణ్యం కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ఉపాధ్యాయులు ఇంగ్లిష్‌ను సులభంగా నేర్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు ఇంగ్లిష్‌లో యాక్షన్‌సాంగ్, స్కిట్స్, రోల్‌ప్లే, ఏకలవ్య, టాకింగ్ ట్రైన్, గ్రామర్, స్పెల్‌బీ, స్టోరీ టెల్లింగ్ వంటివి నిర్వహించారు.
మహమ్మదాబాద్: ప్రతి ఒక్క విద్యార్థి ఆంగ్లము అనర్గళంగా చదవడం, రాయడం నేర్చుకోవాలని ఉపాధ్యాయురాలు శోభ, ఇన్‌చార్జ్ ఎస్ఓ బసమ్మలు సూచించారు. మంగళవారం మహమ్మదాబాద్ కస్తూర్బాలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఆంగ్లంపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ఆటాపాట, ప్రాక్టికల్ ద్వారా స్టేజీపై అనర్గళంగా మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు కృత్యాలతో ఆంగ్లం మాట్లాడారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'మౌంట్‌బాసిల్'లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మౌంట్‌బాసిల్ పాఠశాలలో మంగళవారం పుల్వామాలో జవాన్ల త్యాగాన్ని స్మరించుకొంటూ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. కరస్పాండెంట్ పూజిత మాట్లాడుతూ విద్యార్థులు అమర జవాన్‌ల త్యాగాలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, యాజమాన్య సభ్యులు చంద్రకళా, వెంకటయ్య, కోషాధికారి శిరీష, ప్రవీణ్, సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి కలెక్టర్ అభినందన



సునీతతో కలెక్టర్ రవినాయక్ ఇతర అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమశాఖ హాస్టల్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ అగ్నివీర్‌కు ఎంపికైన సునీతను కలెక్టర్ రవినాయక్ మంగళవారం అభినందించారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో కలిసి ఆమెను సన్మానించారు. జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు, వసతిగృహ సంక్షేమ అధికారి స్వప్నప్రియ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు పీఆర్టీయూ జిల్లా నాయకులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష్య, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాంరెడ్డి, అత్తర్‌పాష, హరినాథ్, బుచ్చారెడ్డి, పురుషోత్తంగౌడ్, అశ్వనీచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కందులు క్వింటాలు రూ.10,070

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కందులకు అత్యధిక ధర లభించింది. క్వింటాలుకు గరిష్ఠంగా రూ.10,070, కనిష్ఠంగా రూ.8110ధర నిర్ణయించారు. వేరుశనగ క్వింటాలు గరిష్ఠంగా రూ. 7006, కనిష్ఠంగా రూ.4515, జొన్నలు రూ.3853, మొక్కజొన్న రూ.2332, పెబ్బర్లు రూ.7409, మినుములు రూ. 9230, ధర పలికాయి.

అత్యాశకుపోయి.. మోసగాళ్లకు చిక్కి..

- యాప్ నిర్వాహకుల వలలో బాల్‌నగర్‌వాసులు
- ఓ బాధితుని ఫిర్యాదుతో కేసునమోదు

బాలానగర్: మండల కేంద్రానికి చెందిన కొందరు యాప్‌వలలో చిక్కి మోసపోయిన ఘటనపై మంగళవారం పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్ఐ తిరుపాజీ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వ్యక్తులు పదుల సంఖ్యలో రెండు, మూడు నెలలుగా ఆన్‌లైన్ యాప్... ఎఫ్ఏఎస్‌యూసీలో రూ. వేలు, రూ. లక్షల్లో డిపాజిట్ చేశారు. చైన్ బేసడ్ సిస్టం ద్వారా డబ్బులు వస్తాయన్న ఆశతో ఈ పెట్టుబడులు పెట్టారు. ఈ మేరకు కొద్ది రోజుల పాటు కొంత నగదు ఖాతాల్లో జమైంది. ఈ క్రమంలో వారు పెట్టుబడులు పెంచి.. ఇతరులను సైతం అధిక డబ్బులు వస్తాయన్న ఆశతో యాప్‌లో చేర్పించారు. కాగా దాదాపు నెల రోజుల నుంచి.. ప్రతివారం ఖాతాలో నగదు జమవ్వడం ఆగిపోయింది. దీంతో యాప్ నిర్వాహకులు తమను మోసం చేశారని పెట్టుబడులు పెట్టినవారు గుర్తించారు. మోసపోయామని తెలిసినా.. ఎవరికీ చెప్పుకోలేక పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే ఇటీవలే కొందరి డబ్బులు సీజ్ చేశామని పత్రికల్లో వార్తలు రావడంతో మండల కేంద్రానికి చెందిన బాల్‌రాజ్ రూ. 1,46,000 డిపాజిట్ చేశానని.. న్యాయం చేయాలని పోలీసులను మంగళవారం ఆశ్రయించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కరాటేలో 'లిటిల్ ఏంజల్స్' ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఇటీవలే జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో జిల్లా కేంద్రంలోని లిటిల్ ఏంజల్స్ పాఠశాల హైస్కూల్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ హెచ్.ఉజ్వల తెలిపారు. ఈ పోటీల్లో చంద్రకళ (బంగారు), శిరీష, గౌరి (రజత), రవీన, అమ్ములు, శాంతి, శిరీష (కాంస్య) పతకాలు సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ రాఘవేందర్, మాస్టర్ ఎస్‌కే.మోసీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోరాడితేనే రాజ్యాధికారం

హన్వాడ: 'అడిగితే వచ్చేది శూన్యం.. పోరాడితేనే రాజ్యాధికారం' గోడపత్రికను బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్‌తో కలిసి స్థానిక తహశీల్దార్ కిష్న్యానాయక్ మంగళవారం విడుదల చేశారు. కృష్ణయాదవ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు టికెట్లు కేటాయించిన వారికే మద్దతు ఉంటుందన్నారు. నాయకులు నర్సిములు, రాజు, వెంకటేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు



వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జడ్చర్ల టౌన్: కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. 45మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఒకరోజు విధులు చేపట్టి పాఠాలు బోధించారు. అనంతరం బోధనలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ం శ్రీనివాసులు, తదితరులు ఉపాధ్యాయులుగా ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.
అడ్డాకుల: రాచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం ఫయాజుద్దీన్, పీఈఓ రాజవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.
తుంకినీపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యాయుడు కురుమయ్య, పంచాయతీ కార్యదర్శి అఖిల్ తదితరులు ఉన్నారు.
చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం..మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ నుంచి నవాబ్‌పేట వైపు ప్రయాణికులతో వెళ్తున్న జీపు బోయపల్లి శివారులోని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో జీపులో ఉన్న రంగారెడ్డి జిల్లా ఎల్కిచర్లకి చెందిన సయ్యద్ యూసుఫ్(60) రోడ్డుపై జారిపడ్డాడు. తలకు బలమైన రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనలో ద్విచక్ర వాహనంపైఉన్న గణేష్‌కు సైతం రక్త గాయాలు అయ్యాయి. కాగా యూసుఫ్ భార్య జైబున్నీసా బేగం ఫిర్యాదు మేరకు జీపు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమికుల దినోత్సవం బహిష్కరించాలి

జడ్చర్ల: ప్రేమ పేరుతో అశ్లీలతను పెంపొందించి విదేశీ సంస్కృతిని బలవంతంగా రుద్దుతున్న ప్రేమికుల దినోత్సవాన్ని బహిష్కరించాలని జడ్చర్ల బజరంగ్ దళ్ శాఖ పిలుపునిచ్చింది. మంగళవారం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు జగ్‌పాల్‌రెడ్డి, నిఖిత్, కిరణ్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ సేవలు

జడ్చర్ల టౌన్: విద్యుత్ సేవలు పొందేందుకు సిబ్బంది, మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారుల సేవాకేంద్రం, ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పొందవచ్చని జడ్చర్ల సబ్‌డివిజన్ ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ గృహ, వ్యాపార, పరిశ్రమలకు సంబంధించిన నూతన కనెక్షన్ తీసుకునేందుకు, కేటగిరి, పేరు మార్పిడి, అదనపులోడ్ మంజూరీ కోసం నేరుగా దరఖాస్తుచేసుకోవచ్చన్నారు.

చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె



చెన్నకేశవస్వామి దేవాలయం, ఇన్‌సెట్‌లో స్వామివారు

అడ్డాకుల: రాచాల చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో జాతర కొనసాగనుంది. జాతర కోసం ఆలయ నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఏటా అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. దాదాపు రెండు వందలకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయం మండలంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా మిక్కిలి ప్రసిద్ధి గాంచింది. ఉత్సవాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యంలో తరలిరానున్నారు.

స్థల పురాణం

రాచాలకు చెందిన గౌవిని వంశస్తులు పెద్ద పుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డి అనే రైతులు ఎద్దుల బండ్లతో రెండు శతాబ్దాలకు పూర్వం ఇంటి నిర్మాణం కోసం కర్రలు తేవడానికి శ్రీశైలం అడవికి వెళ్లారు. తిరుగు ప్రయాణం చేయడానికి సిద్ధం అవుతుండగా వారి ఎద్దులు కనబడలేదు. వెతికి వెతికి ఓ వృక్షం కింద అలసిపోయి పడిపోయారు. అప్పుడు వారికి ఒక ఆకాశవాణి వినిపించింది. వారికి కొద్దిదూరంలో చెన్నకేశవస్వామి విగ్రహం ఉందని.. దానిని గ్రామానికి తీసుకెళ్లమని సూచించింది. వారి బండి ఇరుసు ఎక్కడ విరుగుతుందో అక్కడ స్వామివారి విగ్రహం ప్రతిష్ఠ చేయాలని సూచించగా.. గ్రామ శివారులో ఆ మేరకు రైతులు స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచి స్వామివారు భక్తుల కొంగుబంగారంగా రాచాలలో విరాజిల్లుతున్నారు.

ఉత్సవాలు ఇలా..

16న స్వామి వారి కల్యాణం, రథోత్సవం(తేరు)
17న స్వామి వారి ఉద్దాలోత్సవం
18న శకటోత్సవం, తీర్థావళి, సాంస్కృతిక కార్యక్రమాలు
19న ఎద్దుల బండలాగుడు పోటీలు

- జాతరను పురస్కరించుకుని ఈనెల 19న ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.60వేలు, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.40వేలు, నాలుగో బహుమతి రూ.30వేలు, ఐదో బహుమతి రూ. 20వేలను అందించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.
- అదేవిధంగా జాతర మైదానంలో ఈనెల 17, 18 తేదీల్లో గ్రామానికి చెందిన బోయపల్లి దేవమ్మ, వెంకటయ్య, వారి కుమారుడు బాలయ్య స్మారకార్థం ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన వారు 9704831682 ఫోన్ చేసి పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. మొదటి బహుమతిగా రూ.25వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.8వేలు, నాలుగో బహుమతి రూ.4వేలను అందించనున్నట్లు మాజీ సర్పంచ్ పాశం తిరుపతయ్య, గౌవిని చెన్నారెడ్డి తదితరులు తెలిపారు.